13042024-DIS-04_Layout 1 4/13/2024 2:19 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెగిన జల కంఠాభరణం!

జూపల్లి రమేష్‌రావు
94925 70992

కాళేశ్వరం ప్రాజెక్టుతో ఏం జరిగిందో తెలియాలంటే పాత రోజులకు వెళ్లాల్సిందే. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని గోదావరి నదికి పలు ఉప నదులున్నాయి. ఇందులో ప్రాణహిత జల ధారను మినహాయిస్తే గోదావరికి కుడివైపు నుంచి వచ్చి చేరే మరో ప్రముఖమైన ఉప నది మంజీర. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మునుపు మంజీర బోసిపోయి ఎడారి ప్రాంతాన్ని తలపించేది. ఎగువ కర్ణాటకలో ఆనకట్టల నిర్మాణం మూలంగా వానకాలంలోనూ నీటి లభ్యత గగనమైన దుర్భర పరిస్థితులను కండ్లారా చూసింది. అంతటి అవస్థలో గోదావరికి ఉపనదిగా గుర్తింపు పొందిన మంజీరా నదికి కేసీఆర్ పాలనలో మళ్లీ ప్రాణం వచ్చింది.

ఎప్పుడో ఒకసారి వచ్చే వరద నీటితోనే కాకుండా కాలంతో సంబంధం లేకుండా ఉరకలేసిన జల ప్రవాహం గత పాలనలో కండ్లారా చూశాం. మేడిగడ్డ వద్ద ఎత్తిపోసిన గోదావరి జలాలు ఎగుడు దిగుడులను దాటుకొని భూగర్భం గుండా భూ ఉపరితలం మీదుగా అనేక వాగులు, వంకలతో రిజర్వాయర్ల ద్వారా ప్రవాహాన్ని అందుకొని నిజాంసాగర్‌కు చేరడం తెలంగాణకు అమరిన జల కంఠాభరాణాన్ని తలపించిందంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే భౌగోళిక తెలంగాణలో కందకుర్తి నుంచి గోదావరి ప్రస్థానం మొదలవుతుంది. మంజీరా, హరిద్రా, గోదావరి నదుల కలయికతో త్రివేణి సంగమం పోటెత్తుతుంది. ఇక్కడినుంచి దిగువకు మేడిగడ్డ వద్ద నిలువరించిన నీళ్లను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తిరిగి నిజాంసాగర్‌కు చేరి, ఆ నీళ్లు వరద వచ్చినప్పుడు తిరిగి మంజీరాలో దిగి కందకుర్తికి చేరడం ద్వారా జల ఆవర్తనం కండ్ల ముందే గోచరించింది. ఈ ప్రవాహ తాండవాన్ని మనసు పెట్టి అర్థం చేసుకుంటే జీవనదికి జల కంఠాభరణంగానే కనిపించడం తథ్యం. ఒక స్త్రీకి కంఠాభరణం ఎంతటి శోభను తీసుకు వస్తుందో అచ్చంగా తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జల కంఠాభరణం సాక్షాత్కరించింది. అలాంటి సొగసులు అద్దుకున్న జీవనది పరిస్థితి ఇప్పుడు తెగిన కంఠాభరణంలా మారింది.

ఎస్సారెస్పీకి అటూ, ఇటూ...: కాళేశ్వరం పథకంలో భాగమైన ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం గోదావరి నదికి జీవం పోసింది. దిగువకు నీళ్లను పంపేందుకు తవ్విన కాలువ ద్వారానే ఎగువకు నీళ్లను ఎక్కించి ప్రాజెక్టును నింపడమే ఈ పథకం ముఖ్యోద్దేశం. వరద కాలువ ద్వారా వేల క్యూసెక్కుల ప్రవాహంతో మండుటెండల్లోనూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 40 టీఎంసీల మేర నీటి నిల్వతో తటస్థంగా ఉండటానికి గత పాలకుల ముందు చూపు, వారి దార్శనికతకు నిలువుటద్దంలా మారింది. అలాంటి పోచంపాడ్ ప్రాజెక్టు ఇప్పుడు కేవలం 12 టీఎంసీలతో డెడ్ స్టోరేజీకి చేరువలో కళావిహీనమై కనిపిస్తున్నది. 40 టీఎంసీల నీటి నిల్వకు ఎస్సారెస్పీ చేరితే ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పశ్చిమ వైపునకు తన్నుకురావడం ద్వారా బాసర, కందకుర్తి వరకు జల కాంతులు దర్శనం ఇచ్చేవి. కానీ ఇప్పుడు పోచంపాడ్‌లో ఏర్పడిన నీటి కొరతతో తెలంగాణ ఏర్పాటుకు మునుపు సమైక్య పాలనలో ఎదురైన దుర్భర పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎటు చూసినా ఎడారి మాదిరిగా పోచంపాడ్ ప్రాజెక్టు నిలవడం, కందకుర్తి త్రివేణి సంగమం పైకి తేలిపోయి ప్రవాహమే లేక పాయలా మారడం చూస్తుంటే దశాబ్దన్నర కిందటి దృష్టాంతాలు సాక్షాత్కరిస్తున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎగువ, దిగువ ఎటు చూసినా నీటి కొరతతో గోదావరి నదిలో బండరాళ్లు, ఎండిపోయిన పిచ్చి మొక్కలే తప్ప నీటి జాడ లేకపోవడంతో రైతన్నల్లో దిగులు ఏర్పడింది

సరిగ్గా నాలుగు నెలల కిందటి వరకు ఎండకాలానికి, వానకాలానికి సంబంధం లేకుండా జల ప్రవాహాలు కానరాగా వరద కాలువతో పాటు చెరువులను కలిపే పిల్ల కాలువలు సైతం ఇప్పుడు ఎండిపోయి వెలవెలబోతున్నాయి. వానకాలం ఆరంభానికి ఇంకా నెలన్నర రోజులుంది. ఒకవేళ వాతావరణ పరిస్థితులు సానుకూలిస్తే అంతా ఓకే. వానలు ఆలస్యమైతే రైతుల పరిస్థితి అగమ్యగోచరమే. పుటం మడులు పోసుకునేందుకు కూడా నీటి లభ్యత కష్టమే. ఓ వైపు భూగర్భ జలం కొరత, మరోవైపు నీటి వనరుల లేమితో రైతన్నలు నెత్తినోరు కొట్టుకోవాల్సి వస్తున్నది.

> అనాలోచిత నిర్ణయాలు, రాజకీయ కక్షసాధింపు చర్యల మూలంగా జల సౌభాగ్యం కానరాకుండా పోయింది. పదేండ్ల తెలంగాణలో గోదావరికి జల జీవం పోసిన ఘనత ఒకరిది కాగా... అదే జీవనది ఊపిరి తీసిన ఘనత ఇప్పటి పరిపాలకులది. కందకుర్తి నుంచి మొదలవుతోన్న త్రివేణి సంగమ క్షేత్రం ఎడారిబారుతున్నప్పటికీ స్పందన కరువై కేవలం రాజకీయ ఎజెండానే పరమావధిగా నడుస్తోన్న ఈ పాలనలో ఇంతకంటే మంచిని ఆశించడమే మన తప్పు కాక మరేమిటి? అన్న ప్రశ్నలు సామాన్య జనాల్లో ఉత్పన్నమవుతున్నాయి.

(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్, ఉమ్మడి నిజామాబాద్)

ఏదీ.. యువ వికాస పథకం

రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. 'మేం అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలో ఉన్నటువంటి స్కీంలను, అలాగే 6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తాం' అని వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటిపోయింది. కానీ 6 గారెంటీలు మాత్రం ఇంకా ఇంతవరకు పూర్తిగా అమలుకు నోచుకోలేదు.

దేవేందర్ ముంజంపల్లి
89784 58611

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలలో 5వ గ్యారెంటీ అయిన 'విద్యార్థి యువ వికాసం'తో విద్యార్థులకు విద్యా భరోసా కార్డు ఇస్తామని ప్రకటించింది. అలాగే ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 'యువ వికాసం స్కీమ్' గురించి ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

'యువ వికాస పథకం' ద్వారా ఫీజులు, కోచింగ్ ఫీజు చెల్లింపుల కోసం రూ.5 లక్షల గ్యారెంటీ కార్డు ఇస్తామని హామీ ఇచ్చింది కాంగ్రెస్. రాష్ట్రంలో ఏటా దాదాపు 7 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, వైద్య తదితర కోర్సుల్లో ప్రవేశం పొందుతున్నారు. ఈయేడు కూడా దాదాపు పూర్తికావస్తోంది. అలాగే ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని లక్షల మంది విద్యార్థులు బయటకు రాబోతున్నారు. కానీ ఇప్పటికీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందడం లేదు. దాదాపుగా రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థి యువ వికాసంలో జమ చేస్తారా లేక విడిగానే ఇస్తారా.. అనే ఆందోళనలో విద్యార్థులున్నారు. విద్యార్థి యువ వికాసం కార్డ్ ఎలా ఇస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ ఈ కార్డుతో విద్యార్థులు ఎడ్యుకేషన్ లోన్లు తీస్తే వడ్డీ ఎవరు భరిస్తారన్నది ప్రశ్నగా మారింది. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగం వైపు కన్నెత్తి కూడా చూడలేని స్థితి రాష్ట్రంలో ఉన్నది.

'యువ వికాసం స్కీం'లో భాగంగా ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుచేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ, అది ఏ మేరకు అమలుచేస్తారనేది అందరి మదిలో నెలకొన్నటువంటి ప్రశ్న? గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం 'మన ఊరు-మన బడి' పథకాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు వసతులు కల్పించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.7,289 కోట్లు కేటాయించింది. కానీ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమం పూర్తి కాలేదు. రాష్ట్రంలో 600కు పైగా మండలాలున్నాయి. అయితే ప్రభుత్వం ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తుందా లేదా అనే సంశయం విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంటున్నది. ఇదంతా కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక పెను సవాలుగానే మారనున్నది.

(వ్యాసకర్త: జర్నలిజం పరిశోధక విద్యార్థి, కేయూ)

జవాబు.. ప్రశ్నే మరి!

ప్రశ్నల లోపమో లేక ప్రశ్నలే మంచివి కావో, ప్రశ్నించేవాళ్లే మనకు ప్రశ్నార్థకమో తెలియదు కానీ, కాలర్ పట్టుకొని అడిగినవాళ్లంతా కటకటాల పాలవుతున్నారు రాష్ట్రీయం, జాతీయం, అంతర్జాతీయం అనే తేడా లేకుండా ఓటర్లంతా నిక్కచ్చిగా నిలదీసి అడగలేకపోతున్నారు నాయకులను. ఏది అభివృద్ధి? ఎవరు మంచి, ఎవరు చెడు? ఏది రాజధాని? ఎక్కడ నిధులు? మద్యం నిషేధమా? లేక బాండ్ల సమస్యా? నిన్నటివరకు ఈ పార్టీలో రేపు మరో పార్టీలో? పరీక్ష రాసే విద్యార్థి మదిలోని అర్థంకాని చిక్కు ప్రశ్నల్లా!

జోస్యుల వేణుగోపాల్
94404 36806

ప్రజలకు ఎన్నికల సమయంలో ఆ భయం లేదు, అభయమూ లేదు! ఇప్పుడు ఓటర్లు దైవస్వరూపాలు, దైవమే మనలో ప్రవేశించి సమాధానపరుస్తుంది. అడిగే నాయకులే అడ్డగోలు అన్నట్లుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు మ్యానిఫెస్టోలను ఈస్టమన్ కలర్‌లో చూపించి, వెంటనే తూచ్ అంటూ మడిచి మన జేబులోనే పెట్టి దూరంగా జరిగి, తర్వాత ప్రతిపక్షంలోకి వచ్చి అధికారానికి దూరమైతే నిరంతరం చేతిలో మైకుతో, రాత్రి పగలు తేడా లేకుండా అర్థమే కాని హామీలతో, కొత్త నినాదాలతో ఇరుకు సందులన్నీ ఒడుపుగా తిరుగుతూ, ప్రశ్నించే ప్రజలతో గొంతు కలిపే నైజాన్నీ ఓటరు ఒడిసి పట్టుకున్నట్టున్నాడు మరి! కాకుంటే ఇది కలికాలం! ఎలక్షన్ కాలంలో ప్రజలపై ప్రేమ అమాంతంగా పెరగడం సహజమే కదా అని సరిపెట్టుకుంటున్నాడు విధి లేక. అన్ని రాష్ట్రాలు మా చేతుల్లోనే ఉండాలనే జాతీయం, అన్ని అసెంబ్లీ సీట్లు మేమే గెలవాలనే రాష్ట్రీయంతో రసవత్తరమైన రాజకీయం నడుస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ మన దేశం 5వ స్థానంలో ఉంచామని చెప్తున్న కొందరు నాయకులకు తాము గెలిచి దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు ప్రజలు కాకుండా మందిరాల్లో, మసీదుల్లో ఎజెండాలు కావచ్చు. సరిహద్దులు, యుద్ధాలు, ఆక్రమణలు, పోరాటాలు, విజయాలు, పాత చరిత్రల చుట్టూ అల్లుకుంటున్న వివాదాస్పద కొత్త సినిమాలపై కొందరి ప్రశ్నలు, మరికొందరి సమాధానాలు ఎన్నికల ఎజెండాలుగా రూపు మార్చుకోవచ్చు.

> అడ్డు తగులుతున్న పక్షాల ప్రశ్నలు అసలు లేకుంటే అభివృద్ధిలో దేశాన్ని ఒకటో స్థానంలో నిలబెట్టే ఆలోచనా అందిపుచ్చుకోవచ్చు. మూడు రెట్లు పెరిగిన పెట్రోలు 3 రూపాయలు తగ్గినా, ముందు నెలలో వాచిపోయిన కరెంటు బిల్లు ఈ నెల్లో కొద్దిగా తగ్గినా, నకిలీలతో నాణ్యత లేకున్నా, సగటు మనిషి సరిపెట్టుకోవడమే.

ఎవరు జైలుకు వెళ్లినా మరెవరు బెయిల్‌పై బయటకు వచ్చినా, ఎవరు కక్షగట్టినా, మరెవరు కరుణ జూపినా, చట్టం, న్యాయం, ధర్మం అన్నీ కలగాపులగమైనా, ఎవరు మంచిచేసినా, మరెవరు మాయ చేసినా, ఎవరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినా, 'చంపేదెవరు? చచ్చేదెవరు?' అన్న సందేహం మనకు లేకుండా 'అంతా నా ఇచ్ఛ ప్రకారమే జరుగుతుందన్న' శ్రీకృష్ణ పరమాత్మ గీతా వచనాలను ఆదర్శంగా తీసుకొని ఓర్పుగా ఎదురు చూసే ప్రజలు అందరి నాయకులను సమానంగా ప్రతి ఐదేండ్లకోసారి 70 నుంచి 80 శాతం ఓట్ల వాన నీటితో కడిగి నచ్చిన నాయకులను పునీతులుగా చేసి మళ్లీ కడిగిన ముత్యంలా నిలబెట్టే ప్రజల వద్ద సరైన ప్రశ్నలు లేకపోవచ్చు, లేదా కొన్నిసోట్ల ఓటు కున్న రేటు, తీసుకున్న నోటుతో ఏదో జవాబు దొరికిందని సంతృప్తి పడవచ్చు.

కొత్త ట్రెండ్‌లో పాంచ్ పచ్చీస్ న్యాయాలు, సూపర్ సిక్స్ గ్యారెంటీలు, మేమంతా సిద్ధం, వికసిత్ భారత్‌లతో దేశవ్యాప్తంగా కనిపించని బ్రహ్మపదార్థమైన అభివృద్ధి కోసం ప్రశార్థకంగా ఎదురుచూసే ప్రజలకు రాష్ట్రాల్లోను, కేంద్రాల్లోను ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలే అవసరం లేని ఎజెండాలతో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలకు ప్రశ్నలే మిగలకుండా పరిపాలించే నాయకులైతే మంచిదే గాని అసలు ప్రజలే లేకుండా, ప్రజలతో పనే లేకుండా చేసే పాలన గుర్తొస్తే మాత్రం కంగారే!

> ప్రజలకు ప్రశ్నలే మిగలకుండా పరిపాలించే నాయకులైతే మంచిదే గాని అసలు ప్రజలే లేకుండా, ప్రజలతో పనే లేకుండా చేసే పాలన గుర్తొస్తే మాత్రం కంగారే!



ఓటమి దిగులు పట్టుకుందా?

ప్రధాని మోదీ ఇప్పుడు ప్రజల ఆహారపు అలవాట్లను నియంత్రించి వారేం తినాలో నిర్ణయించాలనుకుంటున్నారు. ఈ స్వయం ప్రకటిత 'హిందూ' మేధావికి శ్రావణ మాసం జూలై 22న మొదలవుతుందని కూడా తెలీదు. ఆయన ఎందుకంత దిగులు చెందుతున్నారు? వాస్తవ ఎన్నికల సర్వేలు, ఇంటెలిజెన్స్ నివేదికలు ఆయన ఆఫీసుకు చేరాయా?

- సాకేత్ గోఖలే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

ఎటమటం

వీక్ క్యాండిడేట్!

బలమైన అభ్యర్థుల కంటే బలహీనమైన అభ్యర్థిని వెతికి పట్టుకోవడం చిన్న విషయం కాదంట. కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో జాప్యానికి ఇదే కారణమంటున్నారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిని ఇంకా ప్రకటించకపోవడానికి కారణం ఏమిటి? అని ఆ పార్టీ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌ను అడిగితే, వీక్ క్యాండిడేట్ దొరకడమంతా ఈజీ కాదు గదా? అని ప్రశ్నిస్తున్నారు. బలమైన అభ్యర్థి అని చెప్పడానికి కొన్ని ప్లస్ పాయింట్లను చూపించవచ్చు, కానీ అదే వీక్ క్యాండిడేట్ అని చెప్పడానికి కొలబద్ధ ఏముంటుంది? అంటే దానికి కాంగ్రెస్ కొత్త భాష్యం చెప్తున్నది. హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ బరిలోకి దింపే క్యాండిడేట్ వీక్ అని ఎలా చెప్పగలరంటే, ఆ క్యాండిడేట్ పేరు చెప్పగానే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ కళ్లలో మెరుపు కనిపించాలంట! శెభాష్ గుడ్ క్యాండిడేట్ అని ఆయన మెచ్చుకోవాలి.

బ్యాక్‌గ్రౌండ్ వర్క్!

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించడానికి డీసీసీ అధ్యక్షురాలు, తన సతీమణి నిర్మల ప్రత్యక్ష ఎన్నికల ప్రచారానికి పూనుకుంటే, తాను పరోక్ష బ్యాక్‌గ్రౌండ్ వర్క్‌కు పరిమితం అవుతున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాక్‌గ్రౌండ్ వర్క్ సరిగ్గా లేకపోవడమే తన ఓటమికి కారణమని అప్పట్లో జగ్గన్న విశ్లేషించారు కూడా. ఈసారి ఆ తప్పు పునరావృతం కాకూడదని తానే స్వయంగా బ్యాక్‌గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్టు వివరించారు. పార్టీ అభ్యర్థి సౌండ్ పార్టీ కావడంతో బ్యాక్‌గ్రౌండ్ వర్క్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్న ధీమాతో ఉన్నారు జగ్గన్న.

గుంటూరు కావ్య

'గుంటూరు కారం' టైటిల్, ఆ సినిమాకు ఎంత మేరకు కలిసివచ్చిందో ఏమో, కానీ ప్రస్తుతం ఎంపీ ఎన్నికల్లో మాత్రం 'గుంటూరు కావ్య' నినాదంతో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ ప్రచారాన్ని హీట్ ఎక్కించారు. వరంగల్ నుంచి ఎంపీ అభ్యర్థిగా కడియం శ్రీహరి కూతురు కావ్యను బరిలోకి దించింది. ఆమె భర్త నజీర్‌ది గుంటూరు. దీంతో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ లోకల్, నాన్‌లోకల్ ఫీలింగ్ తీసుకొచ్చి ఆ 'గుంటూరు కావ్య' కావాలా? లేక వరంగల్ రమేష్ కావాలా? మీరే నిర్ణయించుకోండంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. 'గుంటూరు కావ్య' నినాదం బాగానే జనంలోకి వెళ్తున్నదని కమలనాథులు కూడా సంబురపడుతున్నారట.

స్కాన్ చేయండి.. స్కామ్ చూడండి!

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 40 పర్సెంటేజీ 'పే సీఎం' నినాదం బీజేపీని గద్దె దించడానికి బలమైన నినాదంగా ఉపయోగపడింది. ఈ వినూత్న ప్రచార వ్యూహాన్ని ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే పార్టీ అందిపుచ్చుకున్నది. చెన్నై నగరంలో పెద్ద పెద్ద హోర్డింగ్స్, పోస్టర్లు వెలిశాయి. వాటిపై ప్రధాని మోదీ బొమ్మపై క్యూఆర్ కోడ్ ముద్రించి 'స్కాన్ చేయండి... స్కామ్ చూడండి' అని రాశారు. మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే, బీజేపీ హయాంలో వెలుగు చూసిన ఎలక్టోరల్ బాండ్స్ మొదలుకొని అదానీ షేర్ల కుంభకోణం వరకు ప్రత్యక్షమవుతున్నాయట. బీజేపీని కార్నర్ చేయడానికి ఇదేదో బాగానే ఉందనే టాక్ వచ్చిందంటున్నారు.

- వెల్జాల